



# కరపత్రం

SINCE 2014

బుధవారం జనవరి 1 2025 | సంపుటి :0 | సంచిక : 81 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## జనవరి 4న తెలంగాణ కేబినెట్ భేటీ.. రైతు భరోసా, రేషన్‌కార్డులపై చర్చ?



హైదరాబాద్: తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు.



## హామీల అమలులో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణకు 2024లో చాలా మంచి జరిగిందని.. ప్రజాపాలనలో ప్రజలకు మంచి చేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖలో పూర్తి పారదర్శకత విధానాలు అమలు చేస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. నల్గొండ లోకసభ స్థానం పరిధిలోని నీటిపారుల ప్రాజెక్టులపై జలసౌధలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఇంజినీర్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ.. హైకోర్టులో ఏజీ వాదనలు



2 లో

- ఫార్ములా - ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో ఏసీబీ తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.
- ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు.

## కొండాపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం

నగరంలోని కొండాపూర్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది.

2 లో




## 15 నిమిషాలు ముందుగానే 'రత్నాచల్'.. జనవరి 1 నుంచి రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు

- దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని పలు రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

2 లో

## డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్.. న్యూ ఇయర్ వేళ ప్రభాస్ వీడియో మెసేజ్!

న్యూ ఇయర్ వేళ సినీ నటుడు ప్రభాస్ ప్రత్యేక వీడియో రిలీజ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించారు. లైఫ్‌లో మనకు బోలెడన్ని ఆనందాలు ఉన్నాయని.. జీవితంలో కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని ప్రభాస్ తెలిపారు. మనల్ని ప్రేమించే, మన కోసం బతికేవాళ్లు ఉన్నప్పుడు.. జీవితాన్ని నాశనం చేసే డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్ అని ప్రశ్నించారు. మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని పిలుపునిచ్చారు. మీకు తెలిసిన వాళ్లు ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలు అయితే టోల్‌ఫ్రీ నంబర్ 8712671111కు కాల్ చేయాలని సూచించారు. డ్రగ్స్ బాధితులకు




ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బాధితులు కోలుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

## భగీరథమ్మ చెరువులో హైడ్రా కూల్చివేతలు

రాయదుర్గం(హైదరాబాద్): నానక్‌రామ్ గూడ భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలను హైడ్రా అధికారులు చేపట్టారు. బఫర్ జోన్‌లోని రెండు ఎకరాల స్థలంలో ఇటీవల ఆక్రమణదారులు రేకుల షెడ్లు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో హైడ్రా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో చేరుకుని జేసీబీలతో నిర్మాణాలను నేలమట్టం చేశారు.



## డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



ఉస్మానియా యూనివర్సిటీ : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 20వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఏడాదిలోనే కాంగ్రెస్ కాలకేయ అవతారం..

### రేవంత్ రావణాసుర రూపం బయట పడ్డాయి : హరీశ్‌రావు

అభయ హస్తం ప్రజలను భయ పెట్టే, భాధ పెట్టే హస్తంగా మారింది. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు 390 రోజులు గడిచినా మొదలు కాలేదు. గ్యారంటీలు అమలు చేయమంటే గారడీల విన్యాసం చేస్తున్నారు. ఏడాది పాలన తర్వాత అనేక సర్వే ఏజెన్సీలు ప్రజల మూడ్ తెలుసుకునే ప్రయత్నాలు చేశాయి. ?ఏ సర్వేలో కూడా రేవంత్‌కు పాస్ మార్కులు కూడా రాలేదు. ఎవరిని అడిగినా రేవంత్‌ను తిడుతున్నరు అనే సమాధానం వస్తోంది. డిక్లరేషన్ల అమలు చేసే బదులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ప్రశ్నిస్తే పగబడుతున్నారు.. పాలసీ ఏదీ అంటే పోలీసులను పంపుతున్నారు. కిట్ల స్థానంలో కాంగ్రెస్ మార్కు తిట్లు వచ్చాయ్ అని హరీశ్‌రావు మండిపడ్డారు.

### ఎన్నికలప్పుడు బోనస్ మాటలు.. ఇప్పుడేమో బోగస్ మాటలు..

ఎన్నికలప్పుడు బోనస్ మాటలు.. ఇప్పుడేమో బోగస్ మాటలు. ఎన్నికలప్పుడు అన్ని పంటలకు బోనస్ అన్నారు %-% ఇప్పుడు ఒక పంటకు మాత్రమే అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అవుతున్నాయి. రుణమాఫీ చివర విడత చెక్కు అని హంగామా చేశారు.. ఇంకా డబ్బులు రైతుల అకౌంట్లలోనే జమ కాలేదు. వరంగల్‌లో మహిళా సంఘాలకు ఇచ్చిన చెక్కుల డబ్బులు కూడా వారికి చేరలేదు. విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు కూడా అమలు కాలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు.

### సీఎంకు ఢిల్లీ పర్యటనల ధ్యాసే తప్ప.. గల్లీల్లో ఉన్న గురుకులాల మీద పట్టింపు లేదు..

బీఆర్ఎస్ నాయకులపై క్షణాల్లో కేసులు పెడుతున్న పోలీసులు.. కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదుచేస్తే పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ నేతలు చెప్పిందే పోలీసులు అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులకు కమీషన్ల మీద ధ్యాసే తప్ప కమిట్‌మెంట్ లేదు. కేసీఆర్ గొప్పగా నెలకొల్పిన గురుకులాలను గాలికి వొదిలేశారు.



హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు దేశ విదేశాల్లో స్థిరపడ్డ తెలంగాణ బిడ్డలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2024లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను హరీశ్‌రావు ఎండగట్టారు. 2024లో ప్రభుత్వ పరంగా ఎందులో చూసినా విజయాల కన్నా.. వైఫల్యాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ?ఎన్నికల సమయంలో ప్రజలకు కోటి ఆశలు చూపిన కాంగ్రెస్ పార్టీ.. ఏట్లో రాయి కాదు, కనీసం కూట్లో రాయి కూడా తీయలేదు అని హరీశ్‌రావు విమర్శించారు.

2 లో

# సంపాదకీయం

## ట్రంప్ సుంకాల బెదిరింపులు- పర్యవసానాలు

అధిక సుంకాలను విధిస్తానంటూ ట్రంప్ తక్కిన దేశాలను బెదిరిస్తున్నాడు. మొదట బ్రిక్స్ దేశాలను బెదిరించాడు. ఆ దేశాలు గనుక డాలర్ మాధ్యమంలో వ్యాపారం చేయడం మానుకుంటే వాటి సరుకులపై అమెరికాలో 100 శాతం దిగుమతి సుంకం విధిస్తానని ప్రకటించాడు. ఆ తర్వాత వంతు యూరోపియన్ యూనియన్ (ఇ.యు) దేశాలది. 2023లో ఆ దేశాలు అమెరికాకు చేస్తున్న ఎగుమతులు అమెరికా నుండి చేసుకుంటున్న దిగుమతుల కన్నా 208.7 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. అంటే వాటితో అమెరికా వాణిజ్యం లోటులో ఉంది. అందుచేత ఆ దేశాలు గనుక అమెరికా నుండి ముడిచమురు, సహజ వాయువు కొనుగోళ్ళను పెంచకపోతే ఆ దేశాల నుండి అమెరికాకు వచ్చే దిగుమతుల మీద సుంకాలను పెంచుతానని హెచ్చరించాడు. ఇవిగాక ప్రపంచంలో ఏ దేశం నుండి అయినా అమెరికాకు దిగుమతయ్యే సరుకులన్నింటి మీదా 10 శాతం సుంకం పెంచుతానని, ప్రత్యేకించి చైనా నుండి వచ్చే దిగుమతుల మీద 60 శాతం పెంచుతానని ప్రకటించాడు. 2023లో చైనా నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులు ఎగుమతులకన్నా 279.4 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. 2018లోనైతే అవి 418 బిలియన్ డాలర్లు అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొంత తగ్గినా, ఇంకా చైనాతో అమెరికా వాణిజ్య లోటు గణనీయంగానే ఉంది.

ఇలా విధించే అధిక సుంకాల ఫలితంగా ఆర్థిక రంగంలో ముఖ్యమైన పరిణామాలు జరుగుతాయి. ఇప్పటికీ ఇ.యు దేశాలు ఇంకా రష్యన్ ముడిచమురు, సహజ వాయువు దిగుమతుల మీద కొంతవరకూ ఆధారపడుతూనే వున్నాయి. అది కూడా లేకుండా మొత్తం అమెరికా నుండే కొనుగోలు చేస్తే అప్పుడు దానివలన ఇ.యు దేశాల్లో చమురు ధరలు ఏమీ పెరగకపోవచ్చు. కాని అమెరికాలో పెట్రోలు, సహజ వాయువు ధరలు కనీసం 30 శాతం పెరగుతాయి. ఇయు దేశాలు అదనంగా కొనుగోళ్ళు పెంచిన ఫలితంగా అమెరికన్ చమురు డిమాండ్ పెరుగుతుంది. ముడి చమురు అంతర్జాతీయ ధరలు ఒకే విధంగా ఉంటాయి గనుక ఇ.యు లో దాని ప్రభావం ఉండదు. కాని అమెరికా వద్ద చమురు నిల్వలు తగ్గిపోయి, ఆ దేశంలో పెరిగే డిమాండ్‌ను తట్టుకోవడానికి అక్కడ ధరలు పెరుగుతాయి. ఇలా పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికి అమెరికా తన చమురు ఉత్పత్తిని అందుకు తగినట్టు పెంచుతుందని ట్రంప్ ప్రకటించాడు. కాని అమెరికాలో చమురు ఉత్పత్తి వ్యాపారం అంతా ప్రైవేటు రంగంలోనే ఉంది. చమురు ఉత్పత్తిని పెంచాలంటే ప్రైవేటు కార్పొరేట్లు అందుకు అదనంగా పెట్టుబడులు పెట్టాలి. అది అంత తేలికేమీ కాదు. ముడిచమురు, సహజ వాయువులను వెలికి తీయడం అనేది పర్యావరణ సమస్యను పెంచుతుంది. పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడానికి అమెరికా ఆమోదించిన పరిమితులను ఉల్లంఘించడం అంత సులభసాధ్యం ఏమీ కాబోదు. దానిని దృష్టిలో ఉంచుకునే ప్రైవేటు పెట్టుబడిదారులు అదనపు పెట్టుబడులను పెట్టడానికి అంత ఉత్సాహాన్ని చూపకపోవచ్చు. అదే విధంగా బ్రిక్స్ దేశాల మీద 100 శాతం సుంకాన్ని అదనంగా విధించడం వలన ఆ దేశాలు దానికి ప్రతీకారంగా తీసుకునే చర్యలు అమెరికన్ ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉంది.

అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. కాని అన్ని దిగుమతులపైనా 10 శాతం సుంకం పెంపు అనే ప్రతిపాదన, చైనా దిగుమతుల మీద 60 శాతం సుంకం పెంపు ప్రతిపాదన కార్యరూపం ధరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చర్యల పర్యవసానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఏ విధంగా ఉండబోతున్నాయో ఇప్పుడు చూద్దాం. కాస్సేపు ఈ రెండు చర్యలకూ తక్కిన దేశాల నుండి ప్రతీకార చర్యలు ఉండవనే అనుకుందాం. బైట దేశాల దిగుమతుల మీద సుంకాలు పెరిగితే వాటి ధరలు అమెరికాలో పెరుగుతాయి. అప్పుడు వాటికి బదులు అమెరికన్ ఉత్పత్తులనే కొనుగోలు చేయడానికి అక్కడి ప్రజలు మొగ్గు చూపుతారు. దానివలన అమెరికన్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఆ డిమాండ్‌ను అందుకోడానికి వీలుగా అమెరికన్ కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచవలసి వుంటుంది. దాని పర్యవసానంగా అమెరికాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

అదే సమయంలో దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన వాటి ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా అమెరికన్ ప్రజల కొనుగోలుశక్తి దెబ్బ తింటుంది. అది ఉపాధి అవకాశాలు తగ్గిపోవడానికి దారి తీస్తుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ట్రంప్ ప్రభుత్వం గనుక 'పొదుపు' చర్యలు చేపట్టడం కూడా జరిగితే (అంటే ప్రజా సంక్షేమం మీద ఖర్చు తగ్గిస్తే) ప్రజల కొనుగోలు శక్తి ఇంకా బాగా తగ్గుతుంది. దాని వలన ఉపాధి ఇంకా ఎక్కువగా దెబ్బ తింటుంది. అయితే, రెండోవైపు దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి దాని వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి గనుక నికరంగా అమెరికాలో అటు ఉత్పత్తి, ఇటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అనుకుందాం.

అయితే తక్కిన ప్రపంచంలో పరిణామాలు వేరేగా ఉంటాయి. అమెరికా విధించిన సుంకాల పెంపు వలన ఆ దేశాల నుండి అమెరికాకు జరిగే ఎగుమతులు తగ్గుతాయి. ఆ మేరకు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచే చర్యలు చేపట్టడం సాధ్యపడదు కనుక ఆ దేశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. నయా ఉదారవాద చట్రంలో చైనా మినహా తక్కిన దేశాలన్నీ ఉన్నాయి కనుక ఆ దేశాల ప్రభుత్వాలు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచడానికి కావలసిన చర్యలను చేపట్టడం సాధ్యపడదు.

అలా డిమాండ్‌ను పెంచాలంటే ప్రభుత్వం చేసే వ్యయాన్ని పెంచాలి. అందుకు తమ దేశ ద్రవ్యలోటునైనా పెంచాలి. లేదా పెట్టుబడిదారుల మీద అదనపు పన్నులనైనా వేయాలి. కాని ఈ రెండు రకాల చర్యలనూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. అయినా దానిని లెక్క చేయకుండా ఏ దేశమైనా వ్యయాన్ని పెంచడానికి చర్యలు చేపడితే ఆ దేశం నుండి ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో బైటకు తరలిపోతుంది. దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు లోనౌతుంది.

నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకూ సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు. చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి. అందుకే అమెరికాకు చైనా దిగుమతులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే దాని ప్రభావాన్ని వీలైనంత మేరకు తగ్గించడానికి చైనా తన దేశీయ మార్కెట్ ను విస్తరించుకుంటోంది. ఇలా చైనా చేయగలగడానికి కారణం చైనా ఆర్థిక వ్యవస్థ, అందులో ఎన్ని రకాల మార్పులు జరిగినా, ఇప్పటికీ ప్రధానంగా ప్రభుత్వ నియంత్రణలో నడిచే వ్యవస్థగానే కొనసాగుతోంది. అక్కడ రాజకీయ నిర్ణయాలకు లోబడి ఆర్థిక వ్యవహారాలు సాగుతాయి. ఇంకా అక్కడ ప్రభుత్వ రంగమే గణనీయమైన భాగంగా ఉంది. పెట్టుబడిదారుల చేతుల్లో లేని ఈ భాగంలో పెట్టుబడికి, వేతనాలకు సంబంధించిన నిర్ణయాలన్నీ ప్రభుత్వమే చేస్తుంది. తక్కిన ప్రపంచంలో కార్మికుల నిజ వేతనాలు దాదాపు స్తంభించిపోయివున్న ప్రస్తుత కాలంలో చైనాలో కార్మికుల నిజవేతనాలు పెరుగుతున్నాయి. ఇందుకు కారణం అక్కడ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే. అందుచేత చైనాలోని దేశీయ మార్కెట్ విస్తరణను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలు అడ్డుకోలేవు. కాని తక్కిన పెట్టుబడిదారీ దేశాల్లో అడ్డుకోగలుగుతాయి.

# ఏడాదిలోనే కాంగ్రెస్ కాలకేయ అవతారం..

# రేవంత్ రావణాసుర రూపం బయట పడ్డాయి : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదు. సీఎంకు ఢిల్లీ పర్యటనల ధ్యాసే తప్ప.. గల్లీల్లో ఉన్న గురుకులాల మీద పట్టింపు లేదు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఉత్తవే అయ్యాయి. 2 లక్షల ఉద్యోగాలు అని 20 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను వక్ర మార్గం పట్టిస్తున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

### అంబేడ్కర్ రాజ్యాంగం పోయి అనుముల రాజ్యాంగం వచ్చింది..

అయితే లాఠీ.. లేకపోతే లూటీ అన్నట్టు ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. అప్పులపై అబద్దాలే.. హామీల అమలుపై అబద్దాలే. అసెంబ్లీలో కూడా అడ్డు అదుపు లేకుండా అబద్దాలు చెబుతున్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి అనుముల రాజ్యాంగం వచ్చింది. రేవంత్ బ్రదర్స్ రాజ్యాంగేతర పనులు శృతి మించుతున్నాయ్. హైడ్రా పేరిట సామాన్యులకు నిద్ర లేకుండా చేశారు.. హైదరాబాద్ ఇమేజీని డామేజ్ చేశారు అని మాజీ మంత్రి నిప్పులు చెరిగారు.

### తెలంగాణ తల్లి విగ్రహం మారితే రేవంత్ తప్పులు ఒప్పులు అయితాయా..

రైతుబంధును విజయవంతంగా ఎగ్గొట్టిన రేవంత్ రైతు భరోసాలో కోతలు పెట్టేందుకు రాత్రి పగలు కష్టపడుతున్నారు. ప్రజల బ్రతుకులు మార్చుతామని నమ్మించి గద్దెనెక్కి తెలంగాణ తల్లిని మార్చాడు. పోలీస్ లోగో మాత్రం మారింది. TS నుండి TGగా మారింది. ఇప్పుడు రాష్ట్ర లోగో కూడా ?మార్చుతామని అంటున్నారు. అయితే, ప్రజల ?బ్రతుకులు మాత్రం మారలేదు. తెలంగాణ తల్లి విగ్రహం మారితే రేవంత్ తప్పులు ఒప్పులు అయితాయా. చివరకు ఫిరాయింపులపై కూడా రేవంత్ తన మాటను ఫిరాయించేశాడు. అవకాశ వాదానికి రేవంత్ మరో పేరుగా మారాడు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### రాజకీయ కక్షలు మానండి - రాష్ట్రం అభివృద్ధి కక్ష్యలో పరిభ్రమించేట్టుగా పాలన సాగించండి..

కాంగ్రెస్, బీజేపీల స్నేహం ఏడాదిలో మరింత బలపడింది. కాళేశ్వరం చిన్న రిపేర్‌ను కూడా సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదు. లగచర్లలో సీఎం భూ దందా బయట పడింది. అమాయకులను అన్యాయంగా అరెస్టు చేశారు. అది మెట్రో అయినా ఫార్మా ప్రాజెక్టు అయినా ప్రభుత్వానికి ఏ విజన్ లేదు. అప్పులు అగాధంగా పెరిగాయి.. అభివృద్ధి అదో పాతాళానికి వెళ్ళింది. ఏడాదిలోనే కాంగ్రెస్ కాలకేయ అవతారం, రేవంత్ రావణాసుర రూపం బయట పడ్డాయి. ప్రజలు ఏం కోల్పోయామో గ్రహిస్తున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మెడలు వంచడం వల్లే ప్రజలకు మేలు జరుగుతోంది. ఈ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ళ సమయం ఉంది. ఆరు గ్యారంటీలతోపాటు, మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 420 అంశాలను అమలు చేయండి. రాజకీయ కక్షలు మానండి %-% రాష్ట్రం అభివృద్ధి కక్ష్యలో పరిభ్రమించేట్టుగా పాలన సాగించండి అని రేవంత్ సర్కార్‌కు హరీశ్‌రావు సూచించారు.

## కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ.. హైకోర్టులో ఏజీ వాదనలు

మొదటిపేజీ తరువాయి

బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ – కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు.

దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు.

దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

భారాస హయాంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బు చెల్లించారని ఉదయం ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర సెక్షన్లు నమోదు చేసినట్లు చెప్పారు. కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు.

## కొండాపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో

# భారీ అగ్ని ప్రమాదం

**నగరంలోని కొండాపూర్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది.**

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: కొండాపూర్ పరిధిలోని రాజరాజేశ్వరి కాలనీ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. అపార్ట్‌మెంట్‌లోని 9వ అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద తీవ్రతకు అపార్ట్‌మెంట్ వాసులు భయంతో బయటకు పరుగులు తీశారు.

## 15 నిమిషాలు ముందుగానే 'రత్నాచల్'.. జనవరి 1 నుంచి రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు

మొదటిపేజీ తరువాయి

విజయవాడ: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పులు వచ్చే జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. రైల్వే సర్వీసులను మరింత మెరుగుపరిచేందుకు, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేందుకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొంది. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌లో ఇక నుంచి 15 నిమిషాలు ముందుగానే బయలుదేరుతుంది. పాత షెడ్యూల్ ప్రకారం విజయవాడ స్టేషన్‌లో ఉదయం 6.15 గంటలకు బయలుదేరాల్సిన రైలు.. మార్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 6 గంటలకే బయలుదేరుతుంది. నిత్యం విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుంటారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది.

## న్యూఇయర్ వేళ పోలీసుల స్పెషల్ ఆఫర్లు.. ప్రశంసించిన ఆనంద్ మహీంద్రా

**నూతన సంవత్సరం వేడుకల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పంజాబ్ పోలీసులు జాగ్రత్త పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వీరు చేసిన వినూత్న ఆలోచనను ప్రముఖ**




**పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు.**

ఇంటర్నెట్ డెస్క్: మరికొన్ని గంటల్లో నూతన సంవత్సరం రాబోతోంది. కొత్త ఏడాదిని మరింత స్పెషల్‌గా ఆహ్వానించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే వేడుకల పేరిట కొందరు వికృత చేష్టలకు పాల్పడే అవకాశం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పంజాబ్ పోలీసులు చేసిన వినూత్న ఆలోచనను ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా మెచ్చారు.

పంజాబ్ పోలీసులు నూతన సంవత్సర వేడుకల వేళ పౌరులను అప్రమత్తం చేస్తూ విన్నూతంగా సూచనలు జారీ చేశారు. "వేడుకల సందర్భంగా అధికంగా మద్యం సేవించడం, వీధుల్లో గొడవలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారికి పంజాబ్ పోలీసులు ప్రత్యేక ఆఫర్లు అందజేయనున్నారు.. అవి ఏంటంటే.. పోలీసు స్టేషన్‌కు ఉచితంగా ఎంట్రీ ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారికి ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇస్తాం. అంతేకాకుండా.. ఈ ఏడాది చివరి రాత్రిని నాశనం చేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే.. 112కి ఫోన్ చేసి మమ్మల్ని ఆహ్వానించవచ్చు" అని పేర్కొన్నారు.

**రాత్రివేళ.. ఒకేసారి 50 వాహనాలు పంక్చర్..!**

ఈ పోస్టు కాస్త మహీంద్రా కంట పడింది. పోలీసులు చేసిన ఈ విన్నూత ప్రయత్నానికి ఆయన ఫిదా అయ్యారు. 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పంచుకుంటూ పోలీసులపై ప్రశంసలు కురిపించారు. సోషల్ మీడియాను తమదైన శైలిలో వినూత్నంగా వినియోగించుకునేవారిలో పోలీసులు ఒకరని పేర్కొన్నారు. అందరికీ 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పోస్టు కాస్త సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు.

## బీచ్‌లో కూరుకుపోయిన ఫెరారీ.. ఎడ్లబండితో బయటకు!



ఇంటర్నెట్ డెస్క్: బీచ్‌లో రైడింగ్ చేయడమంటే సరదాతో పాటు సవాలుగానూ ఉంటుంది. సముద్రం అలలను చూస్తూ రయ్‌మని దూసుకెళ్లడం ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. ఇలాగే ఓ ఖరీదైన కారులో బీచ్‌లో దూసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు వింత అనుభవం ఎదురైంది. కారు ఇసుకలో కూరుకుపోవడంతో ఎడ్లబండితో బయటకు లాగాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఘటన మహారాష్ట్ర రాయ్‌గఢ్‌లోని ఓ బీచ్‌లో చోటుచేసుకుంది.

రాత్రివేళ.. ఒకేసారి 50 వాహనాలు పంక్చర్..!

ముంబయికి చెందిన ఇద్దరు వ్యక్తులు.. తమ ఫెరారీ కారులో రాయ్‌గఢ్‌లోని రేవ్‌దండా బీచ్‌కు వెళ్లారు. అందమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ బీచ్‌లో ముందుకుసాగిపోయారు. ఈ క్రమంలో కారు ఇసుకలో కూరుకుపోయింది. దీంతో అక్కడున్నవారంతా వచ్చి వాహనాన్ని బయటకు లాగే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ ఎడ్లబండి వీరి కంటపడటంతో సాయం కోరారు. ఫెరారీ కారు ముందుభాగాన్ని తాడుతో కట్టి ఎడ్లబండిని ముందుకు పోనిచ్చారు. ఇలా లగ్జరీ కారు ఎట్టకేలకు బయటపడింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# పేలిన బుగ్గారం అవినీతి బుగ్గ

**ఆకుల రంజిత్ కరపత్రం ప్రతినిధి కోరుట్ల నియోజకవర్గం**



జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి - అవక తవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ చేసి, వ్యక్తిగతంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కు తెలంగాణ లోకాయుక్త జస్టిస్ సి.వి.రాములు ఆదేశాలు జారీ చేశారు.అట్టి తీర్పు ప్రతులు పిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి కి రిజిస్టర్ పోస్ట్ ద్వారా అందినట్లు మంగళ వారం ఆయన విలేఖరులకు తెలిపారు.తప్పుడుగా దొంగ ఎంబి లు, ఇతర దొంగ రికార్డులు, దొంగ బిల్లులు సృష్టించి బుగ్గారం గ్రామ పంచాయతీలో భారీగా నిధులు దుర్వినియోగం చేశారని, ఇందుకు కొందరు అధికారులు కూడా సహకరించారని గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదు వెళ్లింది.ప్రముఖ ఉద్యమకారుడు, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి విడిసి ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి అప్పటి జిల్లా కలెక్టర్ ల వరకు అనేక మార్లు పిర్యాదులు చేశారు.నిధుల దుర్వినియోగం పై మూడు సార్లు విచారణ చేపట్టి కూడా జిల్లా కలెక్టర్ తో సహా సంబంధిత అధికారులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని చుక్క గంగారెడ్డి ఆరోపించారు.జిల్లా స్థాయి అధికారులు వారి విధులను, బాధ్యతలను కూడా దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

చట్టాలను, జిల్లా కలెక్టర్ ఆదేశాలను, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ తీర్పులను సైతం బే ఖాతరు చేశారని తెలిపారు.అధికారులు, దోషులపై చర్యలు తీసుకోవడం లేదని, జిల్లా స్థాయి అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అప్పటి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులపై తగు ఆధారాలతో సహా "తెలంగాణ లోకాయుక్త" కు చుక్క గంగారెడ్డి 2022 సెప్టెంబర్ లో పిర్యాదు చేశారు.ఆయన పిర్యాదులు, ఆధారాలు, జిల్లా పంచాయతీ అధికారులు లోకాయుక్త కు అందజేసిన వివరణలను పరిశీలించి డిసెంబర్ 6న తెలంగాణ లోకాయుక్త జస్టిస్ సి.వి.రాములు తుది విచారణ జరిపి తీర్పు జారీ చేశారు.బుగ్గారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి, అవక తవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిధుల దుర్వినియోగాన్ని వ్యక్తి గతంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలంగాణ లోకాయుక్త ఇచ్చిన తీర్పులో పేర్కొన్నారు.ఇదిలా ఉంటే,మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న ఈ న్యాయ పోరాటాన్ని జిల్లా ఉన్నతాధికారులు రాజకీయ ప్రలోభాలకు లొంగి నీరుగార్చారని ఆయన విమర్శించారు.బుగ్గారం జీపీలో కోటికి పైగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. అధికారులు మూడు సార్లు జరిపిన నామమాత్రపు విచారణలో సుమారు యాభై లక్షలకు పైగా నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆధారాలు లభించాయన్నారు.అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. బాధ్యుల నుండి లక్షలాది రూపాయలు రికవరీ చేసిన అధికారులే చట్టపరమైన చర్యలు మరిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు.దుర్వినియోగమైన ప్రతీ పైసా రికవరీ అయి, బాధ్యులందరిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టే దాకా న్యాయపోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## మేడ్చల్ ప్రజలకు తహసీల్దార్ శుభాకాంక్షలు



**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మేడ్చల్ మండల తహసిల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రీమతి శైలజ గారు తన సిబ్బందితో కలిసి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.తన మండల ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, అన్ని శాఖల ఉద్యోగులకు, అనధికారులకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు.ఈ 2025 సం.లో అందరికీ శుభాలు కలగాలని, శాంతి భద్రతలతో కూడిన జీవితాలతో ప్రజలు ఆనందంగా ఉండాలని, సకల సంపదలతో అందరి జీవితాలు విలసిల్లాలని ఆకాంక్షించారు.

## వసంత లక్ష్మి ఇందూర్ కి గర్వకారణం

### - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

**కరపత్రం ఇందూర్ నగరం,డిసెంబర్ 31 :**

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకున్న యోగ మాస్టర్ వసంత లక్ష్మిని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తన క్యాంపు కార్యాలయంలో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు,వసంతలక్ష్మీ గతంలో నోబుల్ వరల్డ్ రికార్డు,ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించి మొక్క ఓని దీక్షతో గిన్నిస్ బుక్ రికార్డ్ లక్ష్యంగా సమాకోనాసనంలో గత రికార్డ్ ను అధిగమించి ఏకధాటిగా 3 గంటల 48 నిముషాలు అసనం వేసి కొత్త రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం దక్కించుకోవడం ఇందూర్ బిడ్డగా అందరికి గర్వకారణం అన్నారు.ఇందూర్ జిల్లా అంటేనే యోగ, క్రీడాలు,సంస్కృతి కళలకు పెట్టిన పేరని అన్నారు, నేటి యువతరం విద్యతో పాటు మానసిక, శారీరక ఉల్లాసం కోసం యోగ, క్రీడలు వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు.వసంత లక్ష్మిని గిన్నిస్ బుక్ రికార్డులో నెలబెట్టిన యోగ గురువు రాంచందర్ గారిని ప్రత్యేకంగా అభినందించి, సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుభాష్ ,రవలి,సుమలత, శివరాజ్,హేమదర్,తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యానంద్

**కరపత్రం నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 31 :**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్)రాష్ట్ర కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లా వాసి డి.సత్యానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ రమేష్ జి గంగాధర్ లు తెలిపారు.నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగిన టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు విద్యారంగ పరిణామలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ,విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్చలు చేశారు.అనంతరం రానున్న రెండు సంవత్సరాల కోసం రాష్ట్ర కమిటీని,రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లో జిల్లావాసి డి.సత్యానంద్ ని ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

## విజయ హాస్పిటల్ యాజమాన్యంపై చట్టరీ చర్యలు తీసుకోండి

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, డిసెంబర్ 31 :**




జిల్లాలోని అమాయక పేదలను చికిత్స పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న విజయ హాస్పిటల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మంగళవారం నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 30న నాళేశ్వర్ గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ నగరంలోని విజయ హాస్పిటల్ లోని న్యూరో స్పెషలిస్ట్ డా. విష్ణు వర్ధన్ వద్దకు చికిత్స కోసం వెళ్లిందన్నారు. అక్కడ ఉన్న రిసిప్షనిస్ట్ డాక్టర్ అందుబాటులో లేకున్నా రూ.400ఫీజు తీసుకుని ప్రిస్క్రిప్షన్ రాసిచ్చారని తెలిపారు. ఎంఐఆర్ తో సహా సుమారు 6టెస్టులు రాసిచ్చిందని తెలిపారు. డాక్టర్ పరీక్షించకుండానే 6టెస్టులు ఎలా చేయించుకోవాలని అడిగినందుకు పేషెంట్ ను బూతు మాటలు తిడుతూ అక్కడి నుంచి గెంటేశారని తెలిపారు. పేషెంట్ నడవలేని 3 లో ఉన్నా కనికరం లేకుండా గెంటేశారని తెలిపారు.కేవలం ధనార్జనే ధ్యేయంగా పేషెంట్ ను పరీక్షించకుండానే టెస్టులు రాయడం, అధికంగా మందులు రాయడం, పేద మధ్యతరగతి వారి నుంచి డబ్బులు గుంజడేమ లక్ష్యంగా లక్షలు గడిస్తున్నారని తెలిపారు. ఈ విషయం అడిగినందుకు సిబ్బందితో దాడులు చేస్తున్నారని తెలిపారు. నగరంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ దందా నడిపిస్తున్నాయని తెలిపారు. ఆర్ఎంపీ డాక్టర్లను మచ్చిక చేసుకుని కమీషన్ల పేరుతో పేషెంట్ ను నిండా ముంచుతున్నారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీకాంత్, తిరుపతి హన్మండ్లు, ఈర్ల రాజ్ గణేష్, అజిగిరి రాకేష్, నల్ల నవీన్ పాల్గొన్నారు.

## వంద స్థంబాల గుడిని పరిరక్షించాలి...

### - హిందూ సంఘాల నాయకులు..

**కరపత్రం బోధన్ డిసెంబర్31..**



బోధన్ పట్టణంలోని పురాతన వంద స్థంబాల గుడిని పరిరక్షించాలని కోరుతూ పట్టణ హిందూ సంఘాల నాయకులు సబ్ కలెక్టర్ వికాస్ మహతో కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ ను హిందూ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వంద స్థంబాల గుడి దగ్గర సోమవారం రాత్రి కొందరు దుండగులు చాదర్ వేసి దర్గా గా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ప్రశాంత వాతావరణం ఉన్న పట్టణంలో అలజడులు సృష్టించే వారిని గుర్తించి చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకువాలని వినతిలో కోరారు. ఆలయం చుట్టూ కంచె ఏర్పాటు చేసి, ఆలయ పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందిచే నిఘా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. నాయకులు సుధాకర్ చారి, కొలిపాక బాలరాజు, మాసిని వినోద్, వాసు, అరవింద్, గౌతం, రవీందర్, శివ, అమృత్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల నిరసన

**కరపత్రం నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 31 :**




చత్తిస్ ఘడ్,ఉత్తర్ ప్రదేశ్ లలో విద్యుత్ రంగాన్ని ప్రైవేటిరణకు వ్యతిరేకంగా నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు గంటపాటు పని నిలుపుదలతో నిరసన తెలిపారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పవర్ హౌజ్ కాంపౌండ్ లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ అధ్వర్యంలో కరేంటు ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్న 12 గంటల నుంచి 1 గంటల వరకు పని నిలుపు దల ధర్నా కార్యక్రమం నిర్వహించారు,జేఏసీ రాష్ట్ర నాయకులు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ,గతంలో నోయిడా ఢిల్లీలో,బొంబాయిలో ప్రైవేటైజేషన్ గతంలో చేసినప్పుడు లాసెస్ గానీ,వినియోగదారులకు సరైన సేవలు అందించక ప్రైవేటీకరణ నిలిచిపోయిందన్నారు.గతంలో కూడా ఉత్తరప్రదేశ్లో ప్రైవేటీకరణ చేస్తామని పిలుపునివ్వగా దానికి భారత దేశవ్యాప్తంగా నిరసన వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో ప్రైవేట్ కార్యక్రమం నిలిచిపోయింది. మరొకసారి ప్రభుత్వం ముందుకు వస్తుంది దాన్ని కూడా ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఉద్యోగస్తులకే కాదు ప్రజలకు కూడా చాలా నష్టం జరుగుతుంది.వ్యవసాయదారుకులకు రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో వరి ధాన్యాలు పంట కూడా మొత్తం దేశంలోని అందరికంటే అత్యధికంగా పండించడం జరిగింది. సబ్సిడీ రేట్లపై గృహ వినియోగదారులకు అందిస్తున్నటువంటి విద్యుత్తు సబ్సిడీ పోతుంది కాబట్టి ప్రజలకు కూడా తీవ్ర నష్టం ఏర్పడుతుంది కాబట్టి ఈ యొక్క ప్రైవేటీకరణ ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేంధర్ గౌడ్ ,పూదరి గంగాధర్,సురేష్,గంగారాం నాయక్,కాశీనాథ్,చంద్రశేఖర్,చెన్నయ్య,శ్రీనివాస్,శంకర్ గౌడ్ సునీత,మదుమతి,నిజాముద్దీన్ సతీష్ 200 మంది విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ను అవమానించిన అమిత్ షా మనువాద వ్యాఖ్యలను ఖండించండి

- అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి
- అమిత్ షా పదవి నుండి వైద్యులు గాలి
- అమిత్ షా పై ఎస్సీ ఎస్టీ, రాజ్యద్రోహం కేసు నమోదు చేయాలి
- కేంద్ర ప్రభుత్వం నుండి బర్తరప్ చేయాలి
- ఇటువంటి ఉదాంతాలు పునరావతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ డిమాండ్
- వెంకటస్వామి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నేత అన్నారు



**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి /హైదరాబాద్**

ఇటీవల భారత పార్లమెంట్లో కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా డా.బి.ఆర్. అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాధులు ఖండించాలని అల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దళ్ నేత ఎం.వెంకటస్వామి దళిత బహుజన సంఘాలకు పిలుపునియ్యడం జరిగింది. ఉదయం 11:00 లకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల అలంకరణ చేసి భారత రాజ్యాంగం వర్ధిల్లాలి, అంబేద్కర్ ఆశయం వర్ధిల్లాలి, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ వర్ధిల్లాలి, నినాదాలు చేస్తూ ఎం.వెంకటస్వామి మాజీ ప్రధాన కార్యదర్శి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నేత మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ ఎస్ ఎస్ బీజేపీ కి ఉన్న అవగాహణనను వ్యక్తం చేశారని అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని అన్నారు దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలన్నారు .

ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపడం హర్షణీయమన్నారు. అమిత్ షా ను పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం మంత్రి పదవి నుండి భర్త రఫ్ చేయాలి, పార్లమెంట్ సాక్షిగా రాజ్య ద్రోహం కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, యావత్తు భారతదేశ ప్రజలకు, దళిత బహుజన ప్రజలకు భే షరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఈ మతోన్మాద చర్యను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేత స్థాపించబడిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సామాజిక ఉద్యమ సంఘం (ఏ.ఐ.ఎస్.ఎస్.డి.) తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు.ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుందనడం సిగ్గు చేటన్నారు. అలా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు.ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారం లోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటన్నారు . నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగం పై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి జరుగుతుందన్నారు .ఈ దాడులను వ్యతిరేకస్తూ రాజ్యాంగం గాన్ని కాపాడు కోవలసిన అవసరం ఉందన్నారు, ఈ కార్యక్రమం రాంప్రసాద్, వినయ్, మునికుమార్, ప్రకాష్, భగవాన్,దాస్,బాలకృష్ణ, భాను,ప్రకాష్, ఆంజనేయులు, నాందేవ్,లత, (జె.బి.యం. డబ్ల్యూ.ఏ.)ఎం.నిర్మల ఏ.ఐ.ఎస్. ఎస్.డి. నాయకురాలు గ్రామకమిటి తదితరులు పాలుగోన్నారు

## రాజమౌళి సేవలు మరువలేనివి.. ఘనంగా జొంగోని రాజమౌళి పదవీ విరమణ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్: డిసెంబర్ 31.**





కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీలో హుజురాబాద్ డిపో పరిధిలో డ్రైవర్ గా సేవలందించి పదవీ విరమణ పొందిన మండలంలోని జూపాకకు చెందిన జొంగొని రాజమౌళి సేవలు ఆర్టీసీ ఎన్నటికీ మరువలేదని హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా ఆర్టీసీలో డ్రైవర్ గా సేవలందించిన రాజమౌళి మంగళవారం పదవీ విరమణ గావించారు. ఈ సందర్భంగా జోంగోని రాజమౌళిని డిఎం రవీంద్రనాథ్, హెడ్ క్లర్కు నజీరుద్దీన్, ఏడీసీలు అల్లకొండ బాపురెడ్డి, టీ సమ్మిరెడ్డి, ఎంసీ పంజాల శ్రీనివాస్ తదితరులు రాజమౌళికి పూలమాలలు వేసి శాలువాలు కప్పి జ్ఞాపక అందజేసి ఘనంగా సత్కరించారు. ఆర్టీసీలో ప్రమాద రహిత డ్రైవర్ గా 30 ఏళ్లుగా పలు డిపోలలో సేవలు అందించి ఎందరో అధికారుల మన్ననలు పొందిన రాజమౌళి సేవలను ఆర్టీసీ సంస్థ ఎల్లవేళలా గుర్తుంచుకుంటుందని ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి అధికారులు, సిబ్బందితో పాటు రాజమౌళి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## మెదక్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కరపత్రం మెదక్ నర్సాపూర్.**



మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజాప్రతినిధులకు మహిళలకు యువతీ యువకులకు విద్యార్థిని విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా కలెక్టర్గా నాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియడానికి వచ్చే జిల్లా అధికారులు, మండల అధికారులు మా కార్యాలయ ఉద్యోగులు వివిధ సంస్థల ప్రతినిధులు అందరు కూడా బొకేస్, స్వీట్స్, డ్రైఫ్రూట్స్ బాక్సెస్ బదులుగా బుక్స్ పెన్స్ తేవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.అలా వచ్చిన బుక్స్ పెన్స్ లను అవసరం ఉన్న ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడానికి ప్రతి ప్రభుత్వ అధికారి నిజాయితీగా, నిస్వార్థంగా కృషిచేసి ప్రజల మన్ననలు పొంది పారదర్శకమైన ప్రజాపాలనను అందించి ప్రజలకు చేరువ కావాలని సూచించారు.

## ఘనంగా డొంకెన బాలరాజు గౌడ్ జన్మదిన వేడుకలు

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్31**



సాధువెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డొంకెన బాలరాజు గౌడ్ జన్మదిన వేడుకలుఘనంగా నిర్వహించారు.మంగళవారం పార్టీలకు అతీతంగా గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు వేడుకలకు హాజరయ్యారు. బాలరాజు జన్మదిన సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన కేకును కట్ చేయించి ఆయనకు తినిపించారు.శాలువాలు కప్పి,బొకేలు, జ్ఞాపికలు అందజేసే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు డొంకెన గణేష్ గౌడ్,జర్నలిస్టులుమీస వెంకటేశం,కొండం నాగరాజు,పద్మశాలి సంఘం అధ్యక్షుడు బేతి గోపాల్ నేత,బింగి గణేష్ నేత,ఈడేం రామకృష్ణ నేత,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు దుబ్బాసి కుమారస్వామి,బింగి శివానంద్ నేత,గుజ్జుక శ్రీనివాస్,జక్కుల కుమార్,ప్రసాద్,గణేష్, కొంగరి నరహరి,హరీష్,వీరేష్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈరోజు రాత్రి 10 గంటల నుండి విస్తృత వాహనాల తనిఖీలు ఎస్సై బి లింగం.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**




మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతన సంవత్సర సంబరాలు సమస్యలు తెచ్చే విధంగా ఉండకూడదని నర్సాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి లింగం మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా అందరూ జరుపుకోవాలని అధికమద్యం సేవించి వాహనాలపై ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాల బారిన పడతారని సూచించారు రాత్రి 10:00 నుంచి విస్తృత వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నమన్నారు.

## తెలంగాణ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, డిసెంబర్ 31.**



ఈరోజు హైదరాబాద్ లోని మినిస్టర్ కోటర్స్ లో తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిసి, ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ వనం రామచంద్రరావు, నాగేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఎరుకల బాబురావు.

## పురస్కార గ్రహీతను అభినందించిన ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి

**కరపత్రం రామగిరి ప్రతినిధి, డిసెంబర్ 31.**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజయవాడ లోఈ నెల 28న జరిగిన 6 వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ప్రముఖుల చేతుల మీదిగా పురస్కారం అందుకున్న జేఎన్టీయూ మంథని ఇంజనీర్ కాలేజి లో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వర్తిస్తున్న బియ్యన తిరుపతి కవి గాయకున్ని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి అభినందించారు. మంగళవారం ప్రిన్సిపాల్ తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి కి శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం రావటం గొప్పవిషయమని బియ్యన తిరుపతి ని కవి గాయకుడుగా రానున్న కాలంలో మరిన్ని ఇలాంటి పురస్కరాలు అందుకొవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిజికల్ డైరెక్టర్ పింగిలి క్రిష్ణ రెడ్డి, పరిపాలన అధికారి సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి పుట్టినరోజు...పలకలు అందజేత

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 31**



రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో అంగన్వాడీ సెంటర్ లో మంగళవారం చిప్ప అశ్విత అనే విద్యార్థిని పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ చిన్నారి తల్లిదండ్రులు చిప్ప మౌనిక- కుమార స్వామి తమ వంతుగా పాఠశాలకు 25 పలకలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పల్లె అనిత, గ్రామ స్పెషల్ ఆఫీసర్ మబ్బు. వాసవి, పంచాయతీ సెక్రటరీ భూసారం రమేష్, అంగన్వాడీ టీచర్ జి.పద్మ పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీని కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 31**



కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, వ్యాపారస్తులు కోలేటి అంజన్న,కోలేటి వేణు తల్లి కోలేటి సుశీల ఇటివల మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుశీలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కోలేటి రమేష్ సీనియర్ పాత్రికేయులు జబ్బర్ ఖాన్,పీవీరావు, నాయకులు సందేవేన కుమార్,తన్నీరు ప్రదీప్, కోలేటి సురేష్, విద్యుత్తు లైన్ మెన్ కలవేన సదానందం పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి.

- జిల్లా వ్యవసాధికారి దోమ ఆదిరెడ్డి.

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 31.**



రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి అని పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కమాన్ పూర్ మండలంలోని డీసీఎంఎస్ జూలపల్లి శ్రీరామ కమాన్ పూర్ బాలకృష్ణ, గుండారం ఆకుల సదయ్యకు చెందిన అర్చన ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూల దుకాణాలలో నాసిరక మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైతులు తమ పంటలకు ఇష్టానుసారంగా మందులు వేయకుండా వ్యవసాయ అధికారులు సూచించిన ఎరువులు మాత్రమే వాడాలని ఆయన అన్నారు. ఫెర్టిలైజర్ వారు నాణ్యతలేని ఎరువుల అమ్మితే వారి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ ఉన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన ఎం.డి.ఆర్ ఫౌండేషన్

- అనాధ శవాలకి దహనం, ఆపదలో ఉన్న పేద ప్రజలకు సేవానందించడంలో నాకు సంతోషంగా ఉంది అన్న
- ప్రముఖ సంఘ సేవకులు జాతీయ సేవరత్న అవార్డు గ్రహీత మధు

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు మండలం రుద్రారం గ్రామ బస్టాండ్ సమీపంలో భిక్షాటన చేసుకునే ఒక వృద్ధుడు నాలుగు రోజుల క్రితం ఎటువంటి స్పందన లేకుండా చూసిన స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు 108 అంబులెన్స్ను పిలిపించి వైద్యులను పంపారు. వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆ వృద్ధుడికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో ఎం.డి.ఆర్ ఫౌండేషన్ ద్వారా తన సామాజిక బాధ్యతగా భావించి అన్ని ఏర్పాట్లు చేసి, అతనికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది, అని తెలియజేస్తూ ఆపదలో ఉన్న ప్రజలకు సేవలందించడంలో సంతోషంగా ఉంది అన్నారు.